

# సిద్దిపేట కలెక్టరేట్.. టీజీ జేఏసీ నిరసన

- మే 5న రాష్ట్రవ్యాప్త మహాధర్నాకు నేతల హెచ్చరిక
- 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్
- పీఆర్సీ అమలు.. సీపీఎస్ రద్దు కోసం నిరసన
- జాయింట్ కలెక్టరుకు వినతిపత్రం అందజేత

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

ఉద్యోగులు.. ఉపాధ్యాయులు.. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది.



గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రెండో పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి.. గడువు పొడిగించకుండా సంఘాలతో చర్చించి అమలు చేయాలని నాయకులు కోరారు. పెండింగ్ బిల్లుల కోసం 13,000 కోట్లు కేటాయించి బకాయిలన్నీ తక్షణమే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. 2024 మార్చి నుంచి రిటైర్ అయిన సుమారు 12 వేల మంది ఉద్యోగులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని స్పష్టం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని.. నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు.

### మే 5న మహాధర్నా

ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే మే 5వ తేదీన రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద మహాధర్నా నిర్వహిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. సుమారు 400 మంది ఉద్యోగులు.. ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ నిరసన అనంతరం జాయింట్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్యాదరి పరమేశ్వర్.. విక్రం రెడ్డి.. తప్పెట్ల యాదగిరి.. ఇంద్రసేనారెడ్డి.. తిరుపతిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్
- కోహెడ మండలంలో ఐకేపీ కేంద్రాల తనిఖీ
- రైతులకు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశం



**కోహెడ, ఏప్రిల్ 17 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని శనిగరం.. తంగళ్ళపల్లి.. కోహెడ.. సముద్రాల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ సందర్శించారు. రైతుల నుంచి ధాన్యాన్ని వేగంగా.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లోని తేమ శాతం.. మౌలిక సదుపాయాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు.. నిర్వాహకులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నీడ కోసం తార్పాలిన్లు.. తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని లక్ష్మీ కిరణ్ సూచించారు. ఎండకాలం నేపథ్యంలో వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి.. తూకం వేయడానికి అవసరమైన వేదికలు.. తేమ కొలిచే యంత్రాలు.. గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధర అందాలని.. దళారీలు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేశారు. 2025-26 రబీ సీజన్‌లో సన్న రకం ధాన్యంపై ప్రభుత్వం బోనస్ ఇస్తున్నందున.. కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాలను తనిఖీ చేస్తూ.. సేకరించిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోహెడ తాసిల్దార్ నవీన్ కుమార్.. ఐకేపీ ఏపీఎం జీ. శ్రీనివాస్ గౌడ్.. ఆర్ ఐ లు ఎల్లయ్య.. సంజీవ్.. సీసీ లు సంపత్.. రాజమౌళి.. వీఓ లు సునీత.. పుష్ప.. రేఖ.. అధ్యక్షులు మంజుల.. రైతులు పాల్గొన్నారు.

# పందుల స్వైరవిహారం.. అధికారులకు వినతి

**వ్యాధుల భయంతో వణికిపోతున్న బెజ్జంకి జనం**

**పట్టించుకోని పంచాయతీ పాలకవర్గంపై ఆగ్రహం**

**తహసీల్దార్.. ఎంపీడీఓలకు గ్రామస్థుల మొర**



**బెజ్జంకి, ఏప్రిల్ 17 (జనం పవర్):** బెజ్జంకి మండల కేంద్రంలో ఊర పందులు స్వైర విహారం చేస్తున్నాయని.. వాటిని వెంటనే అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల అధికారులను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో పందుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ.. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో పందులు ఇష్టారాజ్యంగా తిరుగుతుండటం వల్ల తీవ్ర దుర్గంధం వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల దోమల బెడద పెరిగి.. ప్రజలు రకరకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు పంచాయతీ పాలకవర్గానికి మొరపెట్టుకున్నా.. పందుల బెడదను అరికట్టడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైనా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పందులు తిరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. తహసీల్దార్ శ్రీకాంత్.. ఎంపీడీఓ ప్రవీణ్.. ఎస్ ఐ బోయిని సౌజన్యలకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి.. పందుల యజమానులను హెచ్చరించాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రెడ్డి కార్పొరేషన్ కోసం 21న కలెక్టరేట్ ముట్టడి

**5 వేల కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్**

**ఎన్నికల హామీని ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం**

**రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు ఐలేని మల్లికార్జున్ రెడ్డి**

**బెజ్జంకి, ఏప్రిల్ 17 (జనం పవర్):** తెలంగాణ రాష్ట్రంలో 5000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు ఐలేని మల్లికార్జున్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే 5000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గద్దెనెక్కిన తర్వాత ఆ మాట మర్చిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేద రెడ్డిలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. వెంటనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని నియమించాలని కోరారు. 21న సిద్దిపేటలో నిర్వహించే ధర్నాలో బెజ్జంకి మండల రెడ్డి జేఏసీ నాయకులు.. సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రెడ్డి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు హనుమాండ్ల లక్ష్మారెడ్డి.. బెజ్జంకి మండల అధ్యక్షుడు ముక్కిస తిరుపతిరెడ్డి.. నాయకులు ఐలేని నరసింహారెడ్డి.. విష్ణువర్ధన్ రెడ్డి.. దుంబాల రాజమహేందర్ రెడ్డి.. ఐలేని శ్రీనివాస్ రెడ్డి.. ఐలేని మల్లారెడ్డి.. తాడూరి రామ్ రెడ్డి.. మందపల్లి వెంకటరెడ్డి.. ఐలేని గాలి రెడ్డి.. రామ్ చంద్రారెడ్డి.. రాజిరెడ్డి.. పద్మా రెడ్డి.. గుర్రాల పార్తివ రెడ్డి.. అమరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# తేజస్వి సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం

**తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలి**

**అమరవీరుల త్యాగాలను కించపరచడం తగదు**

**బీజేపీ ఎంపీ తీరుపై బోనగిరి రూపేష్ ఆగ్రహం**



**బెజ్జంకి, ఏప్రిల్ 17 (జనం పవర్):** పార్లమెంటులో తెలంగాణ ఏర్పాటును అవమానపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ బెజ్జంకి మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బెజ్జంకిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఆవిర్భావాన్ని పాకిస్తాన్ విభజనతో పోల్చడం.. అమరవీరుల త్యాగాలను కించపరచడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచీ వివక్ష చూపుతోందని ఆయన ఆరోపించారు. బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేసి కేవలం రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన వారిని అవమానించేలా మాట్లాడటం బీజేపీ నేతల అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సాన కిషన్**

**ఇల్లందకుంట తహసీల్దార్‌కు జాక్టో వినతి**



**ఇల్లందకుంట, ఏప్రిల్ 17 (జనం పవర్):** ఉద్యోగ.. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇల్లందకుంట మండల తహసీల్దార్‌కు జాక్టో ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర జాక్టో పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సాన కిషన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తమ గోడు వినిపించేందుకే ఈ నిరసన కార్యక్రమం చేపట్టామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు.. పదోన్నతులు.. ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభాకర్ రెడ్డి.. జయప్రకాష్.. రామలక్ష్మి.. సంపత్.. సభ్యులు తస్లీమ నజ్నిన్.. సంజన.. శ్రుత కీర్తి.. అనిల్.. ఆనందం పాల్గొన్నారు.

# మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

**సీఎం రేవంత్ రెడ్డి వెంటనే పునరాలోచించాలి**

**జనాభా లెక్కల్లో ప్రభుత్వం అన్యాయం చేస్తోంది**

**సుందిళ్ల మల్లేష్ మాదిగ డిమాండ్**




**మంచిర్యాల, ఏప్రిల్ 17 (జనం పవర్):** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు రావాల్సిన 11 శాతం రిజర్వేషన్ వాటాను తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. జనాభా ప్రకారం 11 శాతం వాటా రావాల్సి ఉండగా.. కేవలం 9 శాతం కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ కోరారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల ముసుగులో మేధావులమని చెప్పుకుంటూ 9 శాతం రిజర్వేషన్‌ను సమర్థించే వారిని గ్రామాల్లో తిరగనివ్వబోమని మల్లేష్ మాదిగ హెచ్చరించారు. అటువంటి వారు జాతి ద్రోహులుగా మిగిలిపోతారని మండిపడ్డారు. గతంలో మందకృష్ణ మాదిగ స్వయంగా ముఖ్యమంత్రిని కలిసి జనాభా దామాషా ప్రకారం 11 శాతం వాటా కావాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### జనాభా లెక్కలపై అనుమానం

రాష్ట్రంలో మాదిగలు కేవలం 36 లక్షల మందే ఉన్నారని ప్రభుత్వం ప్రకటించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 2011 లెక్కల ప్రకారం 33 లక్షల పైగా ఉన్న మాదిగలు.. 15 ఏళ్లలో కేవలం మూడు లక్షలే పెరిగారా అని ప్రశ్నించారు. మాదిగల జనాభాను ప్రభుత్వం కావాలనే తగ్గించి చూపుతోందని ఆరోపించారు. వెంటనే దీనిపై స్పందించి 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

### ప్రధానికి ధన్యవాదాలు

పూలే రెండవ శత జయంతి ఉత్సవ కమిటీలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు చోటు కల్పించడం యావత్ మాదిగ జాతికి.. అణగారిన వర్గాలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని మల్లేష్ తెలిపారు. ఈ అవకాశం కల్పించిన దేశ ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్ పీ నేతలు మంతెన మల్లేష్ మాదిగ.. జలంపల్లి శ్రీనివాస్ మాదిగ.. చుంచు శంకర్ వర్మ మాదిగ.. గద్దల బాలయ్య మాదిగ.. గోడిసెల దశరథం మాదిగ.. రాసపాక మల్లేష్ మాదిగ.. నక్క అంజన్న మాదిగ.. వేల్పుల సతీష్ మాదిగ.. చిప్పకుర్తి మల్లేష్ మాదిగ.. చిప్పకుర్తి సతీష్ మాదిగ.. రాయమల్లు మాదిగ.. స్వామి మాదిగ.. మదనయ్య మాదిగ.. రాజు మాదిగ పాల్గొన్నారు.

జనం పవర్
JANAM POWER

శనివారం
18 ఏప్రిల్ 2026

# అగ్నిపాలైన అన్నదాత ఆశలు!

**బూడిదైన మొక్కజొన్న.. వీట్టాపూర్‌లో రైతులకు కన్నీరు**

**బాధిత రైతులను పరామర్శించిన భోస్లే మోహన్ రావు పటేల్**

**ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని 'పటేల్ ట్రస్ట్' డిమాండ్**



**వేల్పుల నగేష్ జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

అదిలాబాద్ జిల్లా కుంటాల మండలం వీట్టాపూర్ గ్రామంలో అన్నదాతలకు కన్నీళ్లే మిగిలాయి. కట్టా రాజశేఖర్.. కమిండ్ల గంగయ్య.. గుజ్జు సురేష్.. పిట్ల రాజశేఖర్ సాగు చేసిన మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు అగ్నికి బూడిదైంది. చేతికొచ్చిన పంట కాలిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వానాకాలంలో అతివృష్టి వల్ల నష్టపోయిన వీరికి.. రబీలో వేసిన పంటపైనే గంపెడు ఆశలు ఉండేవి. ఇప్పుడు ఆ ఆశలన్నీ అగ్నిపాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పటేల్ బాధిత రైతులను పరామర్శించారు. కాలిపోయిన పొలాలను పరిశీలించి.. రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక నాయకులు.. అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కష్టాల్లో ఉన్న అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీట్టాపూర్ సర్పంచ్ లింగురామ్.. గుండేటి నర్సయ్య.. మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావు.. గ్రామస్థులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాల్లో అధిక వసూళ్లు చేస్తే చర్యలు

**కేంద్రాల వద్ద సిటిజన్ చార్టర్ బోర్డులు ఏర్పాటు చేయాలి**

**దరఖాస్తుల్లో తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలి**

**జైపూర్ తహసీల్దార్ వనజా రెడ్డి**



**జైపూర్, ఏప్రిల్ 17 (జనం పవర్):** జైపూర్ మండలంలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే దరఖాస్తుదారుల నుండి రుసుము వసూలు చేయాలని తహసీల్దార్ వనజా రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని మీసేవ ఆపరేటర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుండి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దరఖాస్తులను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని.. సంబంధిత పత్రాలను సరిగ్గా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి మీసేవ కేంద్రం వద్ద సిటిజన్ చార్టర్ బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేసి.. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను అందులో స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించారు. మీసేవ కేంద్రాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని.. వారికి సేవలు అందించడంలో జాప్యం చేయకూడదని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) సంతోష్.. గిర్ధవార్లు తిరుపతి.. అపర్ణ.. గ్రామ పాలనా అధికారులు పాల్గొన్నారు.

# చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

**ఎంపీఓ శ్రీపతి బాబురావు**



**జైపూర్, ఏప్రిల్ 17 (జనం పవర్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జైపూర్ మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) శ్రీపతి బాబురావు ఆదేశించారు. యాప్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శుక్రవారం ఆయన పౌనూర్.. వేలాల.. శివ్వారం గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను.. 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని.. ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని ఎంపీఓ సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలను తనిఖీ చేసి.. వెలగని వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు తెలిపారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని.. కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని బాబురావు స్పష్టం చేశారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్శనలో స్పెషల్ ఆఫీసర్.. సర్పంచులు వేముల సుధ తిరుపతి గౌడ్.. దేగ స్వప్న నగేశ్.. అంజన్ గౌడ్.. పంచాయతీ కార్యదర్శులు సాగే రాకేష్.. ఎం భాస్కర్.. జీ ప్రవీణ్.. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





# శుద్ధమైన నీరందించడమే లక్ష్యం

- పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు
- కమిషనర్ అశ్రిత్ కుమార్
- మల్లన్నసాగర్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిశీలన

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

పట్టణంలో గత వారం రోజులుగా మురికి నీరు వస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ రంగంలోకి దిగారు. శుక్రవారం ఉదయం ఆయన ఇల్లంతకుంట ఫిల్టర్ బెడ్.. మల్లన్నసాగర్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. నీటి శుద్ధీకరణ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంగోల్ వద్ద ఉన్న 540 ఎంఎల్ డీ మల్లన్నసాగర్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను కమిషనర్ పరిశీలించారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారు.. సహజ జలాలను తాగడానికి వీలుగా మార్చే విధానాలను డీఈని అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించి పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఏఈఈ పృథ్వీ ఉన్నారు.

### పారిశుద్ధ్యంపై కఠిన హెచ్చరికలు

అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు.. జవాన్లతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణాన్ని మరింత శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్మికుల హాజరు పూర్తయిన వెంటనే వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. రోడ్లపై ఇసుక లేకుండా చూడాలని.. తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని.. ఎక్కడైనా అపరిశుభ్రత కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఊడ్చిన చెత్తను వెంటనే తొలగించాలని.. చెత్త కుప్పలు ఎక్కడా కనిపించకూడదని స్పష్టం చేశారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి మొదట అవగాహన కల్పించాలని.. పద్ధతి మార్చుకోకపోతే ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ద్వారా జరిమానాలు విధించాలని కమిషనర్ ఆదేశించారు. పట్టణంలో ఇప్పటికే సీసీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు తడి.. పొడి.. హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని కోరారు. బ్లాక్ స్పాట్లను ఇప్పటికే నిర్మూలించామని.. పూర్తి స్థాయిలో చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈఈ ప్రేరణ.. ఏఈఈ శ్రీనాథ్.. ఎస్ ఐ మహేష్.. శివ.. రాకేష్ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల బకాయిలు విడుదల చేయాలి

- డీఈఓ ఎల్లెంకి శ్రీనివాసరెడ్డికి పీఆర్ టీయూ టీఎస్ వినతి
- ఏడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడి
- ఆర్థిక ఇబ్బందుల్లో పాఠశాల పారిశుద్ధ్య కార్మికులు
- మల్లు ఇంద్రసేనారెడ్డి, శశిధర శర్మ డిమాండ్



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీఆర్ టీయూ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లు ఇంద్రసేనారెడ్డి.. ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు జిల్లా విద్యాధికారి (డీఈఓ) ఎల్లెంకి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో పరిశుభ్రత కోసం ప్రభుత్వం ప్రతి విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పది నెలల పాటు పారిశుద్ధ్య గ్రాంట్ మంజూరు చేస్తోందని తెలిపారు. అయితే సిద్దిపేట జిల్లాలో గత విద్యా సంవత్సరంలో పది నెలలకు గాను కేవలం ఆరు నెలల నిధులు మాత్రమే విడుదలయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి కూడా పది నెలలకు గాను కేవలం ఏడు నెలల నిధులే ఇచ్చారని.. దీంతో పాఠశాలల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు.

### వేతనాలు అందక ఆర్థిక కష్టాలు

గత విద్యా సంవత్సరానికి సంబంధించిన నాలుగు నెలల బకాయిలు.. ప్రస్తుత ఏడాదికి సంబంధించిన మూడు నెలల నిధులను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు సమయానికి వేతనాలు అందకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలన్నీ ఒకేసారి క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు.. సభ్యులు పాల్గొన్నారు.






# గోల్డెన్ అవర్.. ప్రాణాలకు రక్షా కవచం

- సకాలంలో స్పందిస్తే నిలిచే ప్రాణాలు
- ప్రాథమిక వైద్యం.. సీపీఆర్ పై అవగాహన
- బాధితులను ఆదుకుంటే 'రాహ్-వీర్' పురస్కారం
- జైపూర్ ఎస్ ఐ రాజశేఖర్

**జైపూర్, ఏప్రిల్ 17 (జనం పవర్):** జైపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్ సీ) గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై జైపూర్ ఎస్ ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే తొలి గంటలో స్పందిస్తే ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని ఈ సందర్భంగా వివరించారు.

### అత్యంత కీలకం.. ఆ 60 నిమిషాలు

ప్రమాదం జరిగిన తర్వాత మొదటి 60 నిమిషాలను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారని రాజశేఖర్ తెలిపారు. ఈ సమయంలో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందితే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని చెప్పారు. రక్తస్రావం ఆపడం.. శ్వాస సక్రమంగా ఉండేలా చూడటం వంటి ప్రాథమిక చర్యల ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### ఆదుకుంటే 25 వేల బహుమతి

ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించి ప్రాణాలు కాపాడే వ్యక్తులను ప్రభుత్వం 'రాహ్-వీర్'లుగా గుర్తిస్తుందని ఎస్ ఐ తెలిపారు. అటువంటి వారికి ప్రభుత్వం 25,000 నగదు బహుమతితో సత్కరిస్తుందని వివరించారు. ఈ పథకం ద్వారా ప్రజల్లో సేవా భావాన్ని పెంపొందించి.. అత్యవసర పరిస్థితుల్లో బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

### సీపీఆర్ విధానం.. జాగ్రత్తలు

గుండె లేదా శ్వాస ఆగినప్పుడు సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని రాజశేఖర్ వివరించారు. ఛాతిపై నిమిషానికి 100 నుంచి 120 సార్లు సరైన ఒత్తిడితో కంప్రెషన్లు ఇవ్వాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలని.. బాధితులను అనవసరంగా కదిలించకూడదని తెలిపారు. రక్తస్రావం ఎక్కువగా ఉంటే గట్టిగా కట్టు కట్టి నియంత్రించాలని.. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది.. స్థానికులు పాల్గొన్నారు.





# నైతిక విలువలతో కూడిన విద్యే ముఖ్యం

- కాకతీయ హైస్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన 'బీ స్మార్ట్' నేత జగ్గు మల్లారెడ్డి
- ప్రాథమిక స్థాయి చిన్నారులకు సర్టిఫికెట్ల అందజేత
- మహనీయుల బాటలో విద్యార్థులు నడవాలని పిలుపు

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు బీ స్మార్ట్ (బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాథమిక విద్యను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నైతిక విలువలతో పాటు సంస్కృతి.. సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. చిన్నారులకు చిన్ననాటి నుంచే ఒక గుర్తింపు ఇవ్వడం.. సర్టిఫికెట్లతో వారిని ప్రోత్సహించడం వల్ల చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు మల్లారెడ్డి సూచించారు. పురాణాలు.. ఇతిహాసాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ మహనీయుల అడుగుజాడల్లో నడిచేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. విద్య నేర్పిన గురువులకు.. చదివిన పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత.. ఉపాధ్యాయులు.. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# చిన్నకోడూరులో వడ్ల కొనుగోలు షురూ!

## ఐకేపీ కేంద్రం ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

## రైతు బజారును వెంటనే పునఃప్రారంభించాలని అధికారులకు ఆదేశం

- రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచన

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

చిన్నకోడూరు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా.. సౌకర్యవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

### రైతు బజారు పునఃప్రారంభానికి ఆదేశం

చిన్నకోడూరులో మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన రైతు బజారు గత కొంతకాలంగా మూతపడి ఉండటాన్ని చైర్మన్ గమనించారు. పాలకవర్గ సభ్యులతో కలిసి రైతు బజారును క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. దీనిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన పంటను నేరుగా విక్రయించుకునేలా.. ప్రజలకు తాజా కూరగాయలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నారెడ్డి.. వార్డ్ మెంబర్ రఘు.. ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్.. డైరెక్టర్లు నముండ్ల వినోద్.. ఎండీ సలీమ్.. ద్యావ కర్ణాకర్.. అనుపాటి విజయ రెడ్డి.. రాజ వర్ధన్ రెడ్డి.. మశిరెడ్డి మహిపాల్ రెడ్డి.. రాగుల అశోక్.. సింగిరాల లక్ష్మి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు



సందెబోయిన పర్శరాములు.. ఎస్ సీ సెల్ జిల్లా కన్వీనర్ రాజేష్.. గొట్టిపర్తి చందు.. నక్కరాజు.. యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఉడుతా జయంత్.. ఉడుతా ప్రశాంత్.. దుర్గచారి.. సీసీలు కొమురయ్య.. వైకుంఠం.. సీఏలు.. హమాలి సంఘం అధ్యక్షులు.. రైతులు.. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఎక్సైజ్ సీఐ.. రూ. 14 లక్షల నగదు సీజ్



**జుక్కల్, ఏప్రిల్ 17 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలో శుక్రవారం నిర్వహించిన ఈ దాడిలో సీఐ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ప్రభుత్వ అధికార ముసుగులో అవినీతికి పాల్పడుతున్న సత్యనారాయణపై అధికారులు నిశితంగా నిఘా ఉంచి ఈ ట్రాప్ కేసు నమోదు చేశారు. బిచ్కుందలోని సీఐ అద్దె నివాసంలో లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. అక్కడ రూ. 2 లక్షల నగదుతో పాటు ఆయన బ్యాగులో ఉన్న మరో రూ. 45,760లను సీజ్ చేశారు. అనంతరం అధికారులు హైదరాబాద్‌లోని షాద్‌నగర్, శంషాబాద్‌లలో ఉన్న సత్యనారాయణ స్వగృహాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ. 12 లక్షల నగదు లభించినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం కలిపి రూ. 14.45 లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ ప్రతినిధులు తెలిపారు. సీఐ సత్యనారాయణకు సంబంధించిన ఇతర ఆస్తుల వివరాలపైనా ఆరా తీస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, శనివారం ఉదయం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో రిమాండ్ నిమిత్తం హాజరుపరచనున్నారు. ఈ ఆపరేషన్ లో ఏసీబీ బృందంతో పాటు బిచ్కుంద పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ సేవలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా అధికారులు పనుల కోసం లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా ఫిర్యాదు చేయాలని డీఎస్పీ శేఖర్ గౌడ్ కోరారు. అవినీతి అధికారుల సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1064కు గానీ, నిజామాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి గానీ తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

# పసిబిడ్డతో బాధితురాలి పోరాటం

### ప్రేమించి మోసం చేశాడని నీలిమ ఆవేదన

### కానిస్టేబుల్ ఇంటి ముందు బాధితురాలి నిరసన

### న్యాయం చేయాలని వేడుకోలు



**జైపూర్, ఏప్రిల్ 17 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన సోతుకు సాయిరాజ్ (27) కానిస్టేబుల్ గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కురిసింగా నీలిమ (33)ను ప్రేమించి గర్భవతిని చేశాడు. రెండు రోజుల క్రితం ఆమెకు బాబు జన్మించగా.. ఇప్పుడు ఆ బాబుతో తనకు సంబంధం లేదని సాయిరాజ్ మోసం చేశాడని బాధితురాలు ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాబుతో కలిసి సాయిరాజ్ ఇంటి ముందు నిరసన చేపట్టింది. బాధితురాలు రావడంతో సాయిరాజ్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. ఎస్ టీ కోయ సామాజిక వర్గానికి చెందిన తనకు.. ఎస్ సీ మాల సామాజిక వర్గానికి చెందిన కానిస్టేబుల్ న్యాయం చేయాలని ఆమె వేడుకుంటోంది.

# వాసవి అమ్మవారి జయంతోత్సవాలకు ఆహ్వానం

### ముఖ్య అతిథిగా పూజల హరికృష్ణకు పత్రిక అందజేత

### ఈ నెల 25.. 26 తేదీల్లో వేడుకలు

### ఆర్యవైశ్య భవన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



**సిద్దిపేట, ఏప్రిల్ 17 (జనం పవర్):** సిద్దిపేట ఆర్యవైశ్య భవనం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25.. 26 తేదీలలో నిర్వహించనున్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతోత్సవాలకు సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు ఆర్యవైశ్య భవన కమిటీ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఆర్యవైశ్య భవన కమిటీ అధ్యక్షులు అయిత బాల రాజేశం.. ప్రధాన కార్యదర్శి పోశెట్టి శ్రీకాంత్.. ఇతర కమిటీ సభ్యులు హరికృష్ణను కలిసి జయంతోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్ల గురించి ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరగా.. పూజల హరికృష్ణ ఆహ్వానాన్ని స్వీకరించి ఉత్సవాలకు తప్పక హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య భవన కమిటీ సభ్యులు.. నాయకులు.. కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

### దండేపల్లిలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

### పీఆర్‌సీ.. డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్

### సీపీఎస్ రద్దు.. పాత పెన్షన్ అమలు కోసం నినాదాలు

**దండేపల్లి, ఏప్రిల్ 17 (జనం పవర్):** తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపులో భాగంగా దండేపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండో పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని.. పెండింగ్ బిల్లులు.. డీఏలను తక్షణమే క్లియర్ చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు నినదించారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 57 మెమోను అమలు చేస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంగర్స్ రాజేశ్వర్.. అప్పాల మనోహర్.. పాత రమేష్.. గట్ల శ్రీనివాస్.. తిరుపతి.. చేటుపల్లి రమేష్.. సత్యనారాయణ.. రాజిరెడ్డి.. సీహెచ్ శ్రీనివాస్.. రామ్మోహన్.. ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే..
# పోరాటం తప్పదు

**హామీలు ఇచ్చి కాంగ్రెస్ సర్కారు విస్మరించింది,**

**కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల నిరసన,**

**మూడేళ్లయినా పీఆర్‌సీ అతీగతీ లేదు,**

**రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక మాజీ ఉద్యోగుల అవస్థలు,**

**హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వంలో చలనం లేదు**




**కరీంనగర్, ఏప్రిల్ 17 (జనం పవర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల.. ఉపాధ్యాయుల.. పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి విమర్శించారు. సంఘం పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం ముందు మాజీ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగడుతూ భోజన విరామ సమయంలో తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు తమ మేనిఫెస్టోలో పెండింగ్ డీఏలు వెంటనే ఇస్తామని, పీఆర్‌సీని నెల రోజుల్లోనే ప్రకటిస్తామని హామీలు ఇచ్చి నమ్మించారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా.. ఇప్పటికీ గత ప్రభుత్వాన్ని నిందించడమే తప్ప ఉద్యోగులకు చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా మద్దతు తెలిపి.. తమ కుటుంబ సభ్యుల ఓట్లతో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆ విషయాన్ని ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు.

### హైకోర్టు చెప్పినా చలనం లేదు

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లోని రెవెన్యూ డివిజన్లు, మండల తహసీల్దార్ కేంద్రాల్లో పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మార్చి 2024 నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్ అందక వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొందరు వ్యాధిగ్రస్తులై చనిపోయినా ప్రభుత్వంలో చలనం లేదని ధ్వజమెత్తారు. పెన్షన్ బెనిఫిట్స్ విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలాస రామచంద్రం, పెరుక నాగమోహన్, జీవీ మనోహర్ కుమార్ గౌడ్, ఏ శ్రీధర్ రావు, రవీందర్ రాజు, లచ్చిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వేణుగోపాల్, మధుసూదన్ రెడ్డి, మొండయ్య పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి..
# వైద్య ఉద్యోగుల పోరు

**నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట భారీ నిరసన**

**రెండో పీఆర్‌సీ నివేదికను వెంటనే అమలు చేయాలని డిమాండ్**

**ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆందోళన**

**ఐదు విడతల డీఏ బకాయిలను తక్షణం చెల్లించాలి**



**హైదరాబాద్, ఏప్రిల్ 17 (జనం పవర్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండో వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) నివేదికను వెంటనే ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు మిన్నంటాయి. ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి ముందు ఉద్యోగులు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ ఈఎస్ఐ హాస్పిటల్ బ్రాంచ్ అధ్యక్షురాలు విక్టోరియా, ప్రధాన కార్యదర్శి వేణు కుమార్ మాట్లాడుతూ.. ఐదు విడతల కరువు భత్యం (డీఏ) మంజూరు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను ప్రభుత్వం వెనకాడకుండా చెల్లించాలని స్పష్టం చేశారు. వైద్య శాఖలో గుర్తింపు పొందిన యూనియన్ నాయకులపై జరుగుతున్న అక్రమ బదిలీలను రద్దు చేసి, వారి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

### సర్వీసుల క్రమబద్ధీకరణ చేపట్టాలి

వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) లో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ఉద్యోగుల సర్వీసులను వెంటనే రెగ్యులర్ చేయాలని వారు కోరారు. ఈఎస్ఐ ఉద్యోగులకు సంబంధించి జీవో 126ను సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఉదయం హాజరు సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని.. ప్రభుత్వం రెండో పీఆర్‌సీ నివేదిక విషయంలో తాత్సారం చేయడం సరికాదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు సంతోష్, భాగ్య, అరుణ, అంజనీ, సుజాత, శ్రీనివాస్, సత్యనారాయణ, కుమార్, హనీఫ్, రమేష్, ప్రేమలత, అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# పెళ్లి రోజున.. 'అన్న' ప్రసాదం

- వికలాంగుల పాఠశాలలో అన్నదానం
- మురమశెట్టి దంపతుల సేవా గుణం
- వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో వితరణ
- వైశ్య భవన్‌లో 200 మందికి భోజనం
- నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

మురమశెట్టి కుమార్, కవితల పెళ్లి రోజును పురస్కరించుకొని అభయ జ్యోతి మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు ప్రేమతో భోజనం వడ్డించి తమ ఉదారతను చాటుకున్నారు. అనంతరం స్థానిక వైశ్య భవన్‌లో అమావాస్యను పురస్కరించుకొని సుమారు 200 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి మిత్ర మండలి ప్రతినిధి చింత రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజున నిరంతరాయంగా ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మించిన సేవ లేదని.. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ జోజి, వాసవి క్లబ్ అధ్యక్షులు కూర శ్రీనివాస్, శివకుమార్, మిత్ర మండలి సభ్యులు జూలూరు శ్రీనివాస్, చందా వీరేశం, గంప కృష్ణమూర్తి, చింత నరేందర్, చిరంజీవి, రఘు, రాజూరి చంద్రశేఖర్, ఆర్యవైశ్య భవన్ ప్రతినిధులు పోశెట్టి శ్రీకాంత్, అర్వపల్లి హరికిరణ్, చాకిలం రవి, సీహెచ్ శ్రీధర్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# రోడ్డు భద్రతే.. ప్రాణాలకు రక్ష!

- సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోడ్డు భద్రతపై అవగాహన
- గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను వివరించిన వన్ టౌన్ పోలీసులు
- ప్రమాదాల సమయంలో 108, 102 సేవల వినియోగంపై అవగాహన

**సిద్దిపేట, ఏప్రిల్ 17 (జనం పవర్):** సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఏరియా ఆసుపత్రిలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ అంజయ్య, 108 మెడికల్ టెక్నీషియన్ పెరమండ్ల రాజు, పైలట్ జున్న బాలరాజు పాల్గొని ప్రసంగించారు.

### గోల్డెన్ అవర్.. ప్రాణప్రదాత

రోడ్డు ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఆ సమయంలో సరైన చికిత్స అందితే ప్రాణాలను కాపాడవచ్చని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే చేయాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరణ ఇచ్చారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

### అత్యవసర సేవలు సద్వినియోగం

ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ సంపత్, జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలు, గర్భిణుల కోసం 102 సేవలు, మృతదేహాలను తరలించడానికి వాహన సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 102 సిబ్బంది, ఎఫ్ఎస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, హాస్పిటల్‌కు వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.





# వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రెండో పీఆర్‌సీ నివేదిక అమలు చేయాలని డిమాండ్
- ఐదు విడతల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలి
- పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు శ్రీరామరక్ష
- తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నిరసన

**హైదరాబాద్ (సొడమల్ల సన్నీ ఎడ్వర్డ్), ఏప్రిల్ 17 (జనం పవర్):** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. టీవీవీపీ, డీఎంఈ, ఐపీఎం, ఈఎస్ఐ విభాగాలకు చెందిన ఉద్యోగులు ఆయా ఆసుపత్రుల ముందు విధులకు హాజరయ్యే సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండో వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) నివేదికను వెంటనే ప్రవేశపెట్టి అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఐదు విడతల కరువు భత్యం (డీఏ) మంజూరు చేయాలని.. పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను తక్షణం చెల్లించాలని స్పష్టం చేశారు. వైద్య శాఖలో గుర్తింపు పొందిన యూనియన్ నాయకుల అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేసి.. వారి హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్య విధాన పరిషత్ లో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కింద పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, అధ్యక్షుడు ఎం శ్రీనివాస్ మూర్తి, ఇంచార్జి ప్రధాన కార్యదర్శి వేణు కుమార్ డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ఉద్యోగులకు సంబంధించి జీవో 126ను సవరించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, రాష్ట్ర కార్యదర్శులు పుల్ల కిషన్, వాడపల్లి శ్రీధర్ పలు ఆసుపత్రుల వద్ద నిరసనలకు నాయకత్వం వహించారు. వివిధ విభాగాల ప్రతినిధులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# కుట్ర చేస్తే కుర్చీలు కదులుతాయి

## కులగణనలో 'సున్నా' గుర్తింపుపై నిప్పులు

## చెరుగుతున్న సామాజిక వర్గం

12 లక్షల జనాభాను విస్మరించడం సామాజిక సమాధే:

## సాయిని ప్రసాద్

### 40 నియోజకవర్గాల్లో గెలుపోటములను శాసించే సత్తా మాకుంది

### న్యాయం కోసం రాజధాని ముట్టడికి నేతకాని విద్యార్థి సంఘం పిలుపు

**తుడుం జితేందర్ జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో కీలక శక్తిగా ఉన్న నేతకాని సమాజం రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధమవుతోంది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన కులగణన లెక్కల్లో తమ ఉనికినే గాలికొదిలేశారని.. ఇది తమ జాతిని సామాజికంగా సమాధి చేసే కుట్ర అని ఆ సామాజిక వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు టీఎన్ఎంవీఎస్ ఓయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.




#### అంకెల్లో అన్యాయంపై ఆవేదన

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జనాభా గణాంకాల్లో ఉత్తర తెలంగాణలోని ప్రధాన ఎస్ సీ కులమైన నేతకాని ప్రస్తావన లేకపోవడంపై ప్రసాద్ స్పందించారు. సుమారు 12 లక్షల మంది ఉన్న తమ జనాభాను ప్రభుత్వం లెక్కల్లో ఎలా మర్చిపోతుందని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు.. కావాలని తమ గొంతు నొక్కే ప్రయత్నం అని ఆరోపించారు. ప్రభుత్వం కొన్ని కులాలకు తొత్తులుగా మారి.. వివక్షకు గురవుతున్న నేతకానీలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

#### ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

తమను విస్మరించిన ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో బొందపెడతామని సాయిని ప్రసాద్ అల్టిమేటం జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 నియోజకవర్గాల్లో గెలుపోటములను శాసించే స్థాయిలో నేతకానీలు ఉన్నారని.. తమను విస్మరించడం అంటే రాజకీయ ఆత్మహత్యేనని హెచ్చరించారు. జనాభా లెక్కల్లో తమకు సరైన గుర్తింపు ఇచ్చే వరకు విశ్రమించేది లేదని.. గ్రామ గ్రామాన నిరసన జ్వాలలు రగిలిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే రాజధానిని ముట్టడిస్తామని పిలుపునిచ్చారు.

#### మలిదశ ఉద్యమానికి సన్నద్ధం

చరిత్రను చెరిపేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమని.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన ఏ ప్రభుత్వానికైనా బుద్ధి చెప్పే సత్తా తమకు ఉందని నేతలు హెచ్చరించారు. కులగణన అనేది కేవలం అంకెలకు సంబంధించిన విషయం కాదని.. అది రిజర్వేషన్లు, నిధులు, రాజకీయ ప్రాతినిధ్యానికి పునాది అని పేర్కొన్నారు. తక్షణమే తప్పులను సరిదిద్దుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. ఓయూ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్ గళం వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, విద్యార్థి సంఘం సెక్రటరీ అల్లూరి వినోద్, పట్టణ కమిటీ అధ్యక్షుడు దుర్గం వసంత్, మహేష్, లక్ష్మీరాజం పాల్గొన్నారు.



# హక్కుల కోసం రోడ్డెక్కిన ఉద్యోగులు

- కరీంనగర్ కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలతో భారీ నిరసన
- పీఆర్‌సీ.. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్
- దాచుకున్న సొమ్ము కోసం ధర్నాలు చేయాలా? అని ప్రశ్న
- ఉద్యోగ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన
- కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం అందజేత

**కరీంనగర్, ఏప్రిల్ 17 (జనం పవర్):** తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగులు భారీ నిరసన చేపట్టారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వం వహించారు. ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

#### రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాయొద్దు

ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డీఏలు, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు, సరెండర్ లీవ్, మెడికల్ బిల్లులు, ఇన్సూరెన్స్, జీపీఎఫ్ వంటి రాజ్యాంగబద్ధ హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్‌సీ ఇప్పటికీ అమలు కాకపోవడం, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం ఉద్యోగులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

#### దాచుకున్న సొమ్ము కోసం పోరాటమా?

సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి ఎంతో భావోద్వేగంగా ప్రసంగించారు. "రక్తాన్ని చెమటగా మార్చి, నెలనెలా పైసా పైసా ప్రోగు చేసుకున్నది పిల్లల పెళ్లిళ్లు, ఇళ్ల నిర్మాణం, ఆరోగ్య అత్యవసరాల కోసమే. కానీ ఈరోజు మా సొంత డబ్బుల కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. ఇవేమీ ఎవరి దయాదాక్షిణ్యాలు కావు.. మా రాజ్యాంగబద్ధమైన హక్కులు" అని పేర్కొన్నారు. ఓపీఎస్ పునరుద్ధరణ, హెల్త్ కార్డుల అమలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, కటకం రమేష్, పేంద్యల కేశవ రెడ్డి, పీఆర్టీయూ కరుణాకర్ రెడ్డి, తిరుపతిరావు, జావిద్, రామ్మోహన్, ఆడేపు శ్రీనివాస్, కోట శ్యాం కుమార్, రేకం శంకర్, జయపాల్ రెడ్డి, సుంకిశాల ప్రభాకర్ రావు, చకినాల రామ్మోహన్, జాలి మహేందర్ రెడ్డి, చంద్రమౌళి, చింతపల్లి అశోకరావు, గోనె శ్రీనివాస్, ఎండీ సలీం, దోనికేన సునీల్ కుమార్, చంద్రశేఖర్, ఆంజనేయరావు, సత్యనారాయణ రెడ్డి, గడ్డం సుధాకర్, డాక్టర్ అరవింద్ రెడ్డి, సర్దార్ హర్మిందర్ సింగ్, కిరణ్ కుమార్, శారద, సునీత, సబిత, సరిత, కోట రామస్వామి, శంకర్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, జలాలోద్దీన్ అక్బర్, శైలజ, వీణ, సుస్మిత, మారుపాక రాజేష్ భరద్వాజ్, కిషన్, వాస్తవి గౌడ్, కోమ్మెర శ్రీనివాసరెడ్డి, విజయ్ కుమార్, వెలిచాల సుమంతరావు, అజ్గర్ అలి, లవ కుమార్, కమలాకర్, కరుణాకర్, నగేష్ గౌడ్ పాల్గొన్నారు.

# వ్యాపారాల విస్తరణకు 'ఉద్యమ్' అండ

### మహిళా సంఘాల సభ్యులకు రిజిస్ట్రేషన్ పై శిక్షణ

### ఉత్పత్తుల మార్కెటింగ్.. ప్రభుత్వ పథకాలపై అవగాహన

### బిచ్కుందలో వీఓఏలు.. సీసీలకు ప్రత్యేక కార్యక్రమం

### సబ్సిడీ రుణ పథకాలపై నిపుణుల వివరణ




**బిచ్కుంద, ఏప్రిల్ 17 (జనం పవర్):** మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య పాలక వర్గ సభ్యులు.. సీసీలు.. గ్రామ సంఘం అసిస్టెంట్ (వీఓఏ)లకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పైన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ స్థాయిలో తయారు చేసే ఉత్పత్తి వ్యాపారాలకు.. సేవా వ్యాపారాలకు ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు.

#### ఆన్లైన్ విధానం.. మార్కెటింగ్ పై అవగాహన

మహిళా సంఘాల సభ్యులు చేస్తున్న వ్యాపారాలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఏవిధంగా ఆన్లైన్ లో పొందాలో ఈ సందర్భంగా వివరించారు. ఈ సర్టిఫికెట్ ద్వారా వ్యాపారాన్ని ఏవిధంగా విస్తరించుకోవచ్చు.. ఉత్పత్తులను ప్రభుత్వ ప్లాట్ ఫామ్ లలో ఎలా అమ్ముకోవచ్చు అనే వివరాలను శిక్షణలో నేర్పించారు. తద్వారా స్థానిక ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలైన పీఎంఎఫ్ఎంఈ (ఫుడ్ ప్రాసెస్సింగ్).. పీఎంఈజీపీ వంటి సబ్సిడీ రుణ పథకాల పైన ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అర్హులైన మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ శిక్షణలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మహానంద, కార్యదర్శి రేష్మా బేగం, కోశాధికారి చంద్రకళ, ఏపీఎం రవీందర్, సీసీలు మైసయ్య, మారుతి, బాలాజీ, పండరి, అకౌంటెంట్ జబ్బార్, అన్ని గ్రామ సంఘాల వీఓఏలు పాల్గొన్నారు.

# బడికి విద్యార్థుల 'గురుదక్షిణ'..

### చదువుకున్న చోట చల్లని కానుక!

### అక్కపల్లిగూడ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వీడ్కోలు వేడుక

### జ్ఞాపకార్థం పాఠశాలకు టేబుల్ ఫ్యాన్ విరాళం

### సుమారు రూ. 3,200 వెచ్చించిన ఐదో తరగతి విద్యార్థులు

### చిన్నారుల సామాజిక స్పృహను కొనియాడిన అధికారులు



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

నేర్చుకున్న చదువు సంస్కారాన్ని నేర్పిస్తే.. ఆ సంస్కారం కృతజ్ఞతగా మారుతుందని అక్కపల్లిగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిరూపించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను వీడి వెళ్తూ, ఆ జ్ఞాపకార్థం వారు అందించిన కానుక అందరి మనసు గెలుచుకుంది. స్థానిక ఎంపీపీఎస్ అక్కపల్లిగూడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సందడి వాతావరణం నెలకొంది. ఐదో తరగతి విద్యార్థుల కోసం నాలుగో తరగతి చిన్నారులు వీడ్కోలు విందు ఏర్పాటు చేశారు. తోటి విద్యార్థుల మధ్య నవ్వులు, జ్ఞాపకాలతో ఈ వేడుక సాగింది.

#### జ్ఞాపకంగా.. చల్లని గాలి!

తమ ఉన్నత చదువుల కోసం పాఠశాల గడప దాటుతున్న వేళ, తాము చదువుకున్న గదికి ఏదైనా గుర్తుగా ఉండాలని విద్యార్థులు నిర్ణయించుకున్నారు. సుమారు 3,200 రూపాయల వ్యయంతో ఒక టేబుల్ ఫ్యాన్‌ను కొనుగోలు చేసి, తమ ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాలకు విరాళం ఇచ్చారు. ఐదేళ్లు తమను తీర్చిదిద్దిన పాఠశాలకు ఇది తాము ఇచ్చే చిన్న 'గురుదక్షిణ' అని విద్యార్థులు పేర్కొనడం విశేషం. చదువు నేర్పిన బడికి, బుద్ధులు నేర్పిన గురువులకు విద్యార్థులు ఇచ్చిన ఈ గౌరవం స్థానికంగా చర్చనీయాంశమైంది.

#### విద్యార్థుల ఆలోచనకు అభినందనలు

చిన్న వయసులోనే విద్యార్థుల్లో కలిగిన ఈ సామాజిక స్పృహను చూసి అతిథులు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి విజయ్ కుమార్ విద్యార్థుల సేవా గుణాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. చైర్మన్ రమాదేవి చిన్నారుల చొరవను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శెట్టి రాజశేఖర్, అంకం కరుణ, తరాల సుదీప విద్యార్థులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

